సమగ్ర కుటుంబ సర్వేకు సర్వం సిద్ధం



ఎన్యూమరేటర్లకు సామగ్రిని అందజేస్తున్న డీసీ మారుతీ దివాకర్

సర్వేపై సిబ్బందితో మాట్లాడుతున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్

అంబర్‌పేట, నవంబర్ 5 : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు అంబర్‌పేట నియోజకవర్గంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నెల 6 నుంచి 21వ తేదీ వరకు జరుగనున్న ఈ సర్వే కోసం ఇప్పటికే ఎన్యూమరేటర్లకు శిక్షణ ఇచ్చారు.

బుధవారం నుంచి వారికి అప్పగించిన ఏరియాకు వెళ్లి సర్వే చేయనున్నారు. ఇందుకోసం నియోజకవర్గంలో ఒక్కో డివిజన్‌కు ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించారు. కాచిగూడ డివిజన్‌కు డీఈ సంజయ్, నల్లకుంట డివిజన్‌కు డీఏఓ ప్రసాద్, గోల్నాక డివిజన్‌కు డీఈ ప్రశాంతి, అంబర్‌పేట డివిజన్‌కు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సుమిత్ర, బాగ్‌అంబర్‌పేట డివిజన్‌కు డీపీఓ రజితను నోడల్ అధికారులుగా నియమించారు. ఈఈ రమేశ్ అందరిపై ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నారు. వీరి పర్యవేక్షణలో సూపర్‌వైజర్లు ఉంటారు. వారి నేతృత్వంలో ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహిస్తారు. ప్రతి ఎన్యూమరేటర్ రోజూ 10 ఇండ్లలో సర్వే చేయనున్నారు. ఇందుకు సంబంధించి సామగ్రిని డీసీ మారుతీ దివాకర్ బుధవారం ఎన్యూమరేటర్లకు అందజేశారు. మొత్తం 56 అంశాల్లో ఈ సర్వే ఉంటుంది. వాటన్నింటికీ ప్రజలు సరైన సమాధానం ఇవ్వాల్సి ఉంటుందని డీసీ తెలిపారు.

కార్వాన్ నియోజకవర్గంలో..

మెహిదీపట్నం : తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను జీహెచ్‌ఎంసీ సర్కిల్ -13లోని కార్వాన్ నియోజకవర్గంలో బుధవారం నుంచి నిర్వహించనున్నారు. 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సర్వే 18 వరకు జరుగుతుంది. ఈ సర్వేను 642 మంది ఎన్యూమరేటర్లు నిర్వహించనున్నట్లు డిప్యూటీ కమిషనర్ శశిరేఖ తెలిపారు. నియోజకవర్గంలోని మొత్తం 91,023 ఇండ్లలో సర్వే చేసి వివరాలను సేకరిస్తారు. సర్వేను 50 మంది సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తారు. మొదటి రెండు రోజులు ఇండ్లకు స్టిక్కరింగ్ చేసి , ఇండ్ల జాబితా రూపొందించడం జరుగుతుందని, అనంతరం 8వ తేదీ నుంచి సమగ్ర సర్వేను నిర్వహిస్తారని డీసీ తెలిపారు. మంగళవారం సర్వే సిబ్బందితో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ తన కార్యాలయంలో పలు అంశాలపై చర్చించారు. సర్వే పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

చెక్కును అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్

గోల్నాక, నవంబర్ 5 : గోల్నాక డివిజన్ గంగానగర్‌కు చెందిన ఎం.రాజయ్య కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఇటీవల ఓ ప్రైవేట్ దవాఖానలో శస్త్ర చికిత్స చేయించుకున్నారు. ఆయనకు మాజీ మంత్రి హరీశ్‌రావు సిఫారసు లేఖతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.28 వేలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును మంగళవారం గోల్నాక కార్పొరేటర్ క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ బాధితుడి కుటుంబసభ్యులకు అందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మెహిదీపట్నం, నవంబర్ 5 : విద్యుత్‌లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ సబ్‌డివిజన్ పరిధిలోని 11 కేవీ పెన్షన్ పురా ఫీడర్‌లో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు,11 కేవీ ఫతే దర్వాజ ఫీడర్‌లో మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు,11 కేవీ కంపెనీబాగ్ ఫీడర్‌లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు,11 కేవీ క్రీసెంట్ దవాఖాన ఫీడర్, 11కేవీ హుమాయూన్‌నగర్ ఫీడర్,11 కేవీ పోలీస్ మెస్ ఫీడర్,11 కేవీ అహ్మద్‌నగర్ ఓవర్‌హెడ్ ఫీడర్,11 కేవీ అహ్మద్‌నగర్ కేబుల్ ఫీడర్,11 కేవీ చాచానెహ్రూ పార్క్ ఫీడర్,11 కేవీ ఖాది భండార్ ఫీడర్, 11 కేవీ ఎస్‌డీఐ దవాఖాన ఫీడర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ ఓ ప్రకటనలో తెలిపారు.

ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం

మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య, పాల్గొన్న గుజ్జ కృష్ణ, గుజ్జ సత్యం

కాచిగూడ, నవంబర్ 5 : ఉద్యమాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని, చదువుతోనే పేదరికం, అసమానతలు తొలగిపోతాయని మాజీ రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం కాచిగూడ అభినందన్ హోటల్‌లో విద్యారంగంలో ఎదుర్కొంటున్న సమస్యలపై మేధోమథన రాష్ట్ర స్థాయి సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ.. తెలంగాణలోని పల్లె పల్లెకు బీసీ ఉద్యమాన్ని తీసుకెళ్లాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. నిబద్ధత, ఐక్యంగా పోరాడినప్పుడు బీసీలు విజయం సాధిస్తారన్నారు. బీసీల పోరాటాల ఫలితమే ప్రభుత్వం దిగి వచ్చి హాస్టల్ మెస్ చార్జీలను పెంచిందని, అదే విధంగా డే స్కాలర్‌పై పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. కేంద్రం పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి అసెంబ్లీ, చట్ట సభల్లో 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి 295 బీసీ కాలేజ్ హాస్టళ్లు, 321 గురుకుల పాఠశాలలకు సొంత భవనాలను నిర్మించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, లాల్ కృష్ణ, జి.మల్లేశ్, నీల వెంకటేశ్, అంజి,సతీశ్, రాజేందర్, నందగోపాల్, అనంతయ్య,, ఉదయ్, జనార్దన్, రాందేవ్, వీరన్న, లింగయ్య, బాషాతో పాటు 33 జిల్లాల విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

నిత్యానందరావు గొప్ప రచయిత

తెలుగు విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య నిత్యానందరావు దంపతులను సన్మానిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి

రవీంద్రభారతి, నవంబర్ 5 : కిన్నెర ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షులుగా పదవీ స్వీకారం చేసిన సందర్భంగా వెలుదొండ నిత్యానందరావుకు మంగళవారం రవీంద్రభారతిలో అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ప్రభుత్వ పూర్వ సలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి, విశిష్ట అతిథిగా పూర్వ తెలుగు విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ తగ్గెడి కిషన్‌రావు విచ్చేశారు. వైస్ చాన్సలర్ వెలుదొండ నిత్యానందరావు దంపతులను సన్మానించారు. కేవీ రమణాచారి మాట్లాడుతూ.. నిత్యానందరావు రచయిత, విద్యావేత్త, పరిశోధకుడిగా మంచి పేరు ప్రఖ్యాతులు సంపాదించుకున్నారు. కార్యక్రమంలో కిన్నెర థియేటర్స్ కార్యదర్శి ముద్దాల రఘురామ్, సాహితీవేత్త పోలేటి పార్వతీశం, ఆచార్య కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, చేరాల నారాయణ, డా.ఆర్.ప్రభాకరరావు పాల్గొన్నారు.

గోల్డ్‌మెడల్ పొందిన వారికి అభినందనలు

అంబర్‌పేట, నవంబర్ 5 : వరల్డ్ పవర్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అక్టోబర్ 24 నుంచి 26 వరకు శంషాబాద్‌లో జరిగిన జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నల్లకుంటకు చెందిన ది విక్రమ్ సూర్య జిమ్ లిఫ్టర్లు ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో గోల్డ్‌మెడల్స్ సాధించారు. ఓపెన్ కేటగిరిలో విక్రం అవరగాని డెడ్ లిఫ్ట్, బెంచ్ ప్రెస్, పుష్ అండ్ పుల్ విభాగాల్లో మొదటిస్థానంలో నిలిచారు. మాస్టర్స్ కేటగిరిలో రాధిక పోనేటి కూడా డెడ్ లిఫ్ట్, బెంచ్ ప్రెస్, పుష్ అండ్ పుల్ విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచారు. శుభ ఎర మాస్టర్స్ కేటగిరిలో డెడ్ లిఫ్ట్‌లో మొదటి స్థానం, హిమజ ఓరుగంటి జూనియర్ కేటగిరిలో డెడ్ లిఫ్ట్‌లో ప్రథమ స్థానం, రాధిమా కూడా జూనియర్ కేటగిరిలో డెడ్‌లిఫ్ట్‌లో మొదటి స్థానం సాధించారు. వీరంతా గోల్డ్ మెడల్స్ అందుకున్నారు. వీరందరిని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ మంగళవారం అభినందించి శాలువాతో సన్మానించారు.

వాడుకలోకి కొత్త సాఫ్ట్‌వేర్

నాంపల్లి కోర్టులు, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): నాంపల్లి కోర్టులకు చెందిన కేసులు, పిటిషన్లకు సంబంధించిన వివరాలను ప్రకటించేందుకు కొత్త సాఫ్ట్‌వేర్‌ను ఏర్పాటు చేసినట్టు నాంపల్లి కోర్టుల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వెల్లడించారు. న్యాయవాదులు తూ.చ. తప్పకుండా పాటించాలని కోరారు. తమ ఎన్‌రోల్‌మెంట్ నంబర్‌తోపాటు మొబైల్ నంబర్‌ను వకాలత్, మెమో అప్పియరెన్స్‌పై తప్పక రాయాలని సూచించినట్టు నాంపల్లి కోర్టుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజ్యవర్ధన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ ప్రకటన ద్వారా వెల్లడించారు. లేనిపక్షంలో కేసులకు కోర్టులు నంబర్లు కేటాయించడం జరగదని తెలిపారు. న్యాయవాదులు తూ.చ. తప్పకుండా పాటించాలని కోరారు.

దేశ వ్యాప్తంగా కులగణన నిర్వహించాలి

బీసీగా ఉండి బీసీలకే అన్యాయం చేస్తున్నాడని, జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. బీసీల హక్కులను మోదీ ప్రభుత్వం అణిచివేస్తుందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో బీసీదళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాచిగూడ,నవంబర్ 5 : దేశ వ్యాప్తంగా కులగణన నిర్వహించినప్పుడే బీసీల సమస్యలు పరిష్కారమవుతాయని జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి అన్నారు. బీసీ ప్రతినిధులతో కులగణనపై మంగళవారం కాచిగూడలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కుమారస్వామి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం కులగణనపై ముందుకు రావడం శుభచూచికమని, కులగణనపై బీజేపీ మంత్రులు, ఎంపీలు ప్రధానిపై ఒత్తిడి తేవాలని డిమాండ్ చేశారు. ప్రధాని

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల నూతన కమిటీ ఎంపిక

టీఎస్ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ హైదరాబాద్ రీజియన్ ఆధ్వర్యంలో మంగళవారం సుల్తాన్‌బజార్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో జరిగిన సమావేశంలో సిటీ రీజియన్ కమిటీ అధ్యక్షులుగా పూస నరసింహ, కార్యదర్శిగా వి. కృష్ణ, కోశాధికారిగా బి.పి.రంగం గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి బీవీ కోటయ్య, కోశాధికారి బుచ్చిరెడ్డి హాజరై వారిని సన్మానించారు.

- తెలుగు యూనివర్సిటీ

దాశరథి రచనలు స్ఫూర్తిదాయకం

దాశరథి చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న నందిని సిధారెడ్డి, డా. ఎన్.బాలాచారి తదితరులు

రవీంద్రభారతి : దాశరథి రచనలు చదవు కపోతే దాశరథికి నష్టం కాదని, కానీ, నేటి కవులు, రచయితలు, యువతరం, తద్వార సమాజానికి నష్టమని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.ఎన్.బాలాచారి, పూర్వ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి అన్నారు. సాహిత్య అకాడమీ కార్యాలయంలో దాశరథి కృష్ణమాచార్య వర్ధంతిని పురస్కరించుకొని సాహిత్య అకాడమీ కార్యాలయంలో కార్యదర్శి బాలాచారి అధ్యక్షతన దాశరథి వర్ధంతి సభను మంగళవారం నిర్వహించారు. దాశరథి రాసిన కథలను ఏర్చికూర్చి 'నిప్పు పూలు' పేరుతో ఓ కథా సంపుటిని వెలువరించింది. సంపుటి ఆవిష్కరణకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన నందిని సిధారెడ్డి ప్రసంగిస్తూ, దాశరథి పేరుతో ఒక స్మారక భవనాన్ని నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. బాలాచారి మాట్లాడుతూ.. దాశరథి కృష్ణమాచార్య నేటి కవులకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని, ఆయన లేకుంటే కవులు, రచయితలు, సమాజానికి నష్టం జరిగేదన్నారు. సభలో టి.ఉడయవర్లు, నాళేశ్వరం శంకరం, దాశరథి కూతురు, అల్లుడు గౌరీశంకర్, గంటా మనోహర్ రెడ్డి, ఆచార్య డా. ఎస్.రఘు, పి.బడే సాబ్, సోమశిల తిరుపాల్ పాల్గొన్నారు.

ఛఠ్ పూజను ఘనంగా నిర్వహిస్తాం

ఉత్తర, మధ్య భారతదేశంలోని ప్రధాన పండుగైన 'ఛఠ్ పూజ'ను ఘనంగా నిర్వహిస్తామని జన్‌సేవా సంఘ్ ప్రధాన కార్యదర్శి రాజీవ్ రంజన్‌చౌబే తెలిపారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో కోశాధికారి బినీత్‌సింగ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. రాష్ట్ర జైళ్ల శాఖ మాజీ డీఐజీ వీకే సింఘ్ మార్గదర్శకత్వంలో నడుస్తున్న జన్‌సేవా సంఘ్ తెలంగాణ సాంస్కృతిక అభివృద్ధికి సహాయకారిగా ఉందన్నారు.

-రవీంద్రభారతి

ప్రమాదాల నివారణకే..కఠిన నిబంధనలు

ప్రమాదాల నివారణకే నిబంధనలు కఠినతరం చేశామని నాంపల్లి ట్రాఫిక్ సీఐ టి. కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్టేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. నాంపల్లి తాజ్‌ఐలాండ్ చౌరస్తా, వై జంక్షన్ ప్రాంతాల్లో నిబంధనలతో కూడిన బ్యానర్‌ను ప్రదర్శించారు. హెల్మెంట్ ధరించని వాహనాదారులు, రాంగ్‌రూట్‌లో నడుపుతున్న వారిని గుర్తించి పెంచిన ఫైన్ విధించి, అవగాహన కల్పించారు. **తెలుగు యూనివర్సిటీ**

రాహుల్ గాంధీ రాకను పురస్కరించుకొని కార్వాన్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి కాంగ్రెస్ కార్యకర్తలతో తరలివెళ్లిన కార్వాన్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్‌అల్ హజ్రీతో పాటు తూంకుంట అరుణ్ కుమార్, కూరాకుల కృష్ణ

- కార్వాన్

సేవాభావంతో పనిచేయాలి

సేవాభావంతో పనిచేయాలని సంఘ సేవకుడు, సుప్రా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గడ్డం సాయికిరణ్ అన్నారు. హైకోర్టు న్యాయవాధి, రైజింగ్ హ్యాండ్స్ సొసైటీ వ్యవస్థాపకుడు రాజేశ్‌ప్రజాపతి ఆధ్వర్యంలో సాయికిరణ్ జన్మదినం సందర్భంగా మంగళవారం దివ్యాంగులకు నిత్యవసరాలు, విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈశ్వర్‌గౌడ్, సుధాకర్ పాల్గొన్నారు.

- కాచిగూడ

కిడ్నాప్ కథ సుఖాంతం

కిడ్నాప్‌కు గురైన బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

సుల్తాన్‌బజార్, నవంబర్ 5. ఉస్మానియా దవాఖానకు చికిత్స నిమిత్తం వచ్చిన ఓ బాలుడు కిడ్నాప్‌కు గురి కాగా అఫ్జల్‌గంజ్ పోలీసులు ఛేదించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మంగళవారం స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ బి. బాలస్వామి, ఏసీపీ శంకర్, సీఐ లింగేశ్వరరావులతో కలిసి వివరాలు వెల్లడించారు. మల్లేపల్లి అఫ్జల్‌సాగర్ మంగార్‌బస్తీకి చెందిన మామ సద్దాం, రూబీనా బేగం దంపతుల కుమారుడు సద్దాం సోమవారం ఉస్మానియా దవాఖానలో కిడ్నాప్‌కు గురయ్యాడు. అనారోగ్యానికి గురైన మామ సద్దాం వైద్యం చేయించుకున్న అనంతరం కుమారుడితో కలిసి ఓపీ భవనం వద్ద నిద్రిస్తున్న సమయంలో దవాఖాన ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై జీవనం సాగిస్తున్న వరంగల్‌కు చెందిన షేక్‌రఫీక్ బాలుడిని తీసుకుని వెళ్లిపోయాడు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు సీసీటీవీ పరిశీలించి కిడ్నాపర్ చెర నుంచి 12గంటల వ్యవధిలోనే బాలుడిని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

కులగణనతో కొన్ని వర్గాలకు అన్యాయం

సమావేశంలో మాట్లాడుతున్న గిరిప్రసాద్‌శర్మ

రవీంద్రభారతి : కులాలను విభజించి వివరాలు సేకరించే పద్ధతి సరికాదని, కులగణన వల్ల కొన్ని వర్గాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందని పలు బ్రాహ్మణ సంఘాల నాయకులు గిరిప్రసాద్‌శర్మ, చింతపల్లి మంగళపతిరావు, దర్శనం పత్రిక సంపాదకులు వెంకటరమణశర్మ, మురుకుంట్ల రాజేశ్వర శర్మ, ఉప్పల బాలసుబ్రహ్మణ్యంలు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తొందర పడితే ఇరుకున పడుతుందని, అగ్రకులాల జాబితాలో ఉండి పేదరికంలో మగ్గుతున్న బ్రాహ్మణ, వైశ్య ఇతర కులాలకు అన్యాయం జరగడం కాకుండా కులాల మధ్య విబేధాలు పెరిగే అవకాశం ఉందన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్ లో మీడియా సమావేశంలో నాయకులు బోర్పట్ల హనుమంతాచార్య, పీఎస్ఆర్ మూర్తి, మల్లాది చంద్రమౌళి, పి.భీమ్‌సేన్‌మూర్తి, సత్యనారాయణ మూర్తిలతో కలిసి వారు మాట్లాడుతూ.. బ్రాహ్మణ, వైశ్య ఇతర అగ్రకులాల్లోని శాఖల జోలికి వెళ్లకుండా కేవలం రాజ్యాంగంలో ఉన్నట్లుగా కులాలను గణన చేయాలన్నారు.

మధ్యంతర బెయిల్ గడువు పెంచాలి

నాంపల్లి కోర్టులు, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో అదనపు ఎస్పీ భుజంగరావు మధ్యంతర బెయిల్ గడువు పెంచాలని కోరుతూ 1వ అదనపు జిల్లా కోర్టు ఎదుట మంగళవారం బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. చికిత్స నిమిత్తం మూడుసార్లు కోర్టు గడువును పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. గుండె సంబంధిత శస్త్ర చికిత్సలు చేయించుకునేందుకు అవకాశం కల్పించాలని నిందితుడి తరపు న్యాయవాది కోర్టుకు పిటిషన్లను దాఖలు చేసిన విషయం తెలిసిందే. శస్త్ర చికిత్సలు అత్యవసరమని భావించిన కోర్టు మూడు సార్లు 55 రోజుల పాటు వెసలుబాటు కల్పించింది. నాలుగోసారి కూడా గడువు పెంచాలని నిందితుడు కోర్టును కోరారు. ఈ కేసు విచారణను 11వ తేదీకి వాయిదా వేస్తూ 12వ అదనపు చీఫ్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అదే రోజున మధ్యంతర బెయిల్ గడువు కూడా పూర్తి కానుండటంతో మంగళవారం మరోసారి నిందితుడి తరపున బెయిల్ పిటిషన్‌ను దాఖలు చేశారు. ఈసారి కోర్టు గడువు పొడిగిస్తుందా.. లేదా.. అన్న అనుమానంతో ముందుగానే కోర్టును ఆశ్రయించారు. నిందితుడి తరపున పీపీకి నోటీసులు జారీ చేసిన తర్వాత కోర్టు వాదనలు వింటుంది. ఇరువర్గాల వాదనలు విన్న తర్వాతే మధ్యంతర గడువు పొడిగింపుపై తీర్పు వెల్లడించనుంది.

ఒకే కులంగా పరిగణించాలి

తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్, గౌరవాధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి

రవీంద్రభారతి : బీసీ కులగణనలో కమ్మరం, వడ్రంగం, కంచరి, శిల్పం, స్వర్ణకారం, స్వర్ణకార వృత్తులు చేస్తున్న తమ సంఘీయులను వేర్వేరుగా పరిగణించకుండా పంచదాయ వృత్తులు చేస్తున్న విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మలను ఒకే కులస్తులుగా పరిగణించి బీసీ కులగణనలో ఎన్యూమరేట్ చేసే విధంగా మార్గదర్శకాలు విడుదల చేయాలని బీసీ డెడికేటెడ్ కమిషన్ చైర్మన్ బూసాని వెంకటేశ్వరరావుకు తెలంగాణ విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్‌మోహన్, గౌరవాధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి విజ్ఞప్తి చేశారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో వారు మాట్లాడుతూ.. గతంలో జరిగిన జనాభా గణనలో వృత్తులనే కులాలుగా భావించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల మధ్య విభజించు పాలించు పద్ధతిని ప్రవేశపెట్టి విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల జనాభాను తగ్గించే కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచార్యులు, కోశాధికారి రాఘుఘణీంద్రచారి, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు నాగారం భాస్కరచారి పాల్గొన్నారు.

వీడని వృద్ధ దంపతుల హత్య కేసు మిస్టరీ..!

అంబర్‌పేట, నవంబర్ 5: అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాయిబాబానగర్ కాలనీలో అక్టోబర్ 17న జరిగిన వృద్ధ దంపతులు పి.లింగారెడ్డి, ఊర్మిళాదేవిల దారుణ హత్య కేసు మిస్టరీ ఇంకా వీడలేదు. నిందితుల కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నా ఇప్పటి వరకు ఆచూకీ లభించలేదు. అంబర్‌పేట స్టేషన్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నా ఎక్కడ కూడా చిన్న క్లూ దొరకడం లేదు. మృతుల ఇంటి చుట్టు పక్కల, ఇంటి వెనుకాల, అద్దెకు ఉన్నవారిని విచారించినా, కాలనీ, మెయిన్‌రోడ్డులో ఉన్న దుకాణదారులు, ప్లంబర్లను, సీసీ ఫుటేజీల్లో నమోదైన ప్రతి వాహనదారుడిని విచారించినా, చివరకు ఇంట్లో పేపర్ వేసే బాయ్స్‌ను కూడా ఆరా తీసినా, కాలనీలో ఉన్న మొత్తం సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించినా, కాలనీవాసులను, బయటవారిని, చుట్టుపక్కల పనికివచ్చే వారిని ఇలా అందరిని విచారించినా ఇప్పటి వరకూ ఏ చిన్న క్లూ కూడా లభించలేదు. ఇంట్లోకి ఎవరు వచ్చారు? ఎట్ల వచ్చారు? ఎవరు చంపారు? ఎలా చంపారు? మళ్లీ ఎటు నుంచి వెళ్లారు? అనే అంశాలు కూడా అంతుపట్టడం లేదు. హతుల ఇద్దరి ఫోన్‌కాల్స్‌ను కూడా పరిశీలించి అందులో ఉన్న నంబర్లకు ఫోన్‌చేసి వాకబు చేస్తున్నారు. ఘటన జరిగి 20 రోజులు పూర్తయినా కేసులో ఎలాంటి పురోగతి లేదు. హత్య జరిగిన విషయం రెండు రోజుల తర్వాత తెలవడం...డ్రైవర్ ద్వారా తెలుస్తోందని నమ్మడం..తర్వాత ఏ క్లూ దొరకకపోవడం వంటి అంశాలు కూడా ఈ కేసు పురోగతికి అడ్డంకిగా మారాయని సమాచారం. చివరకు హతుడు పి.లింగారెడ్డికి ఎవరైనా శత్రువులు ఉన్నారా? ఫైనాన్స్ మ్యాటర్స్, ల్యాండ్ మ్యాటర్స్...కేసులు వంటి విషయాలపై కూడా దృష్టి పెట్టి విచారణ చేస్తున్నట్లు సమాచారం. చివరకు సుపారీ ద్వారా హత్య జరిగిందే మోననే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి

మెహిదీపట్నం, నవంబర్ 5 : జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగం అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్ అన్నారు. బోనాలు, రంజాన్, దసరాలకు చేయాల్సిన పనులను ఇప్పటి వరకు పెండింగ్‌లో పెట్టడం ఏంటని అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం టోలిచౌకిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సర్కిల్ -13 డిప్యూటీ ఈఈ రామకృష్ణ, ఏఈ ఉదయ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్‌అలీపై ఎ మ్మెల్యే మండిపడ్డారు. అభివృద్ధి పనుల ను పెండింగ్‌లో పెట్టడానికి కారణమైన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఈఈ వెంకటశేషయ్యకు ఫోన్‌లో సూచించారు.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి

కాచిగూడ,నవంబర్ 5 : గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతంలో చోటుచేసుకున్నది. కాచిగూడ ఎస్సై హెచ్.నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు (70) కాచిగూడ రైల్వేస్టేషన్ వెనుకభాగంలో గల పుట్‌పాత్‌పై అనారోగ్యంతో మంగళవారం మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానమార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై మెరున్ చొక్క, నలుపు ప్యాంట్ ఉందని, ఎత్తు 5.0 ఉన్నట్లు తెలిపారు. వివరాలకు 8712660545లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ ARBITRATOR AT NIZAMABAD.
ARB/Dispute No.206 of 2024

Between:
Chaitraratha Chits Pvt.Ltd., Kamareddy Br. ...Disputant
And
Mr.KUNTA SHIVA KUMAR & Others
... Opponents

NOTICE

To,
Opponent No.1
1. KUNTA SHIVA KUMAR S/O. K.RA